# వరంగల్ వాయిస్

*Evening Daily*

సంపుటి : 04 | సంచిక : 202
పేజీలు : 08 | వెల: రూ.5/-

సోమవారం
మే 12, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## మాట ఇస్తే తప్పకునేదే లేదు

- ప్రతి పనిని చిత్తశుద్ధితో పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- భూమి పూజ చేసిన మంత్రి సీతక్క

# 'బంధన్' బరితెగింపు



## కడుపు నొప్పని వస్తే కాటికి పంపిన వైనం

- పెద్దఎత్తున బంధువుల ఆందోళన
- బీఏఎంఎస్, ఫామ్-డి డాక్టర్లచే వైద్యం చేయిస్తున్నారంటూ మండిపాటు
- రాజకీయ నేతల అండతో యాజమాన్యం ఇష్టారాజ్యం
- గతంలోనూ పలు ఫిర్యాదులు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని జిల్లా వైద్యాధికారులు

హనుమకొండ బస్టాండ్ రోడ్ లోని బంధన్ హాస్పిటల్ యాజమాన్యం బరితెగించింది. తెలిసీ తెలియని వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రాణాలు పోతున్నా పశ్చాతాప పడకుండా ఎదురు దాడికి దిగుతున్నారు. బంధువులను హాస్పిటల్ లోనే ఉంచి బయట తాళాలు వేసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. తాజాగా కడుపు ఉబ్బరంగా ఉంది అంటూ అస్పత్రికి వచ్చిన రోగి ప్రాణాలకే ఎసరు పెట్టడంపై వారి బందువులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అర్హులైన డాక్టర్లు లేకపోవడంతో బీఏఎంఎస్, ఫామ్–డి డాక్టర్లచే వైద్యం చేయించారంటూ మండి పడ్డారు. సోమవారం జరిగిన ఈ ఘటనతో 'బంధన్' అక్రమాలు మరోమారు బహిర్గతమయ్యాయి. ఇలాంటి సంఘటనలు ఇక్కడ నిత్య కృత్యంగా మారిప్పటికీ బయటి ప్రపంచానికి తెలుస్తున్నవి కొన్ని మాత్రమే. గతంలోనూ ఆస్పత్రి అక్రమాలపై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. స్వయానా ఒక జర్నలిస్ట్ తనకు జరిగిన అన్యాయంపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతోపాటు జిల్లా కోర్టును సైతం ఆశ్రయించారు. అయినప్పటికీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి బంధన్ ఆస్పత్రి భరతం పట్టాలని, ప్రజల ప్రాణాలను హరిస్తున్న ఆస్పత్రి అనుమతులు రద్దు చేయాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. – వరంగల్ వాయిస్, హనుమకొండ






వివరాలు2లో..




# 'బంధన్' బరితెగింపు

- కడుపు నొప్పని వస్తే కాటికి పంపిన వైనం
- పెద్దఎత్తున బంధువుల ఆందోళన
- బీఏఎంఎస్, ఫామ్-డి డాక్టర్లచే వైద్యం చేయిస్తున్నారంటూ మండిపాటు
- రాజకీయ నేతల అండతో యాజమాన్యం ఇష్టారాజ్యం
- గతంలోనూ పలు ఫిర్యాదులు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని జిల్లా వైద్యాధికారులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కడుపు ఉబ్బరంగా ఉందంటూ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన పెండెం మహేందర్ రావు (61) హనుమకొండ బస్టాండ్ రోడ్ లోని బంధన్ హాస్పిటల్ లో చేరితే ఏకంగా కాటికి పంపండంపై బందువులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అనుభవం లేని డాక్టర్లతో వైద్యం చేయించడంవల్లే మహేందర్ రావు మృతి చెందారంటూ మండిపడ్డారు. గుండె జబ్బు ఉన్న రోగికి ఇవ్వాల్సిన మందులను కాకుండా అధిక డోస్ మందులను వాడడంవల్లే మరణించాడంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు. బీఏఎంఎస్, ఫామ్–డి డాక్టర్లచే వైద్యం చేయించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేందర్ రావుకు భార్య, పెళ్లికి ఎదిగిన ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. తండ్రికి కోల్పోయిన వీరి అరణ్య రోధనలు ఆస్పత్రి ప్రాంగణంలో మిన్నంటాయి.

**బెదిరింపులు..**

కడుపు ఉబ్బరంగా ఉంది..మోషన్ రావడంలేదంటూ బంధన్ ఆస్పత్రికి చేరితే 24 గంటల్లో కాటికి పంపడంపై బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తే ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బెదిరింపులకు పాల్పడడంపై మండిపడ్డారు. హాస్పిటల్ లోనికి ఎవరినీ అనుమతించకుండా అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సైతం ఆస్పత్రి యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తూ బందువులపైనే తమ ప్రతాపం చూపించడం ఏంటని ప్రశ్నించారు. మృతుడి బంధువులతోపాటు పలువురిని హాస్పిటల్ లోనే ఉంచి తాళం వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**విషయం బయటికి రాకుండా..**

అమ్మ జన్మనిస్తే.. డాక్టర్లు పునర్జన్మనిస్తారు. కాని ఇక్కడ మాత్రం డాక్టర్లే రాబందుల్లా మారి రోగుల ప్రాణాలు తీస్తున్నారంటూ మహేందర్ రావు బంధువులు ఆరోపించారు. కడుపు ఉబ్బరంగా ఉందంటూ ఆస్పత్రికి వచ్చిన రోగిని కాపాడలేని వీరు ఏం వైద్యులంటూ నిలదీశారు. వైద్యం అందించలేక రోగి చనిపోతే ఈ విషయం కూడా బయటికి రాకుండా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఇక్కడ నిత్యకృత్యంగా మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఏ ఒక్క విషయం కూడా బయటికి రాకుండా యాజమాన్యం అడ్డుకుంటుందంటూ మండిపడుతున్నారు.

**గతంలోనూ..**

గతంలో కూడా అనుభవం లేని డాక్టర్లు అపెండిక్స్ ఆపరేషన్ చేయడంతో అది ఫెయిల్యూర్ అయి ప్రాణాపాయ స్థితికి చేరిన ఘటన మరువకముందే,



కడుపు ఉబ్బరంతో బాధపడుతూ ఆదివారం ఆస్పత్రిలో చేరిన మహేందర్ రావు సోమవారం మృతి చెందిన వార్త నగరంలో కలకలం రేపింది. గతంలోనే అపెండిక్స్ ఫెయిల్యూర్ కు సంబంధించి హాస్పిటల్ నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని ఒక జర్నలిస్ట్



హనుమకొండ వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

**కలెక్టర్ స్పందించాలి..**

అస్పత్రిలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న సంఘటలనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి ఉంటే నేడు మహేందర్ రావు మృతి చెంది ఉండేవాడే కాదని బందువులు పేర్కొన్నారు. అప్పుడే వాళ్లు స్పందించి హాస్పిటల్ లో వైద్యులు ఎవరున్నారు? ఎలాంటి ట్రీట్మెంట్ చేస్తున్నారు? క్వాలిఫైడ్ డాక్టర్లు ఉన్నారా? లేదా? అనే విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకుని ఉంటే నేడు మరో ప్రాణం బలి అయ్యేది కాదంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఆస్పత్రిలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆస్పత్రి అనుమతిని రద్దు చేయాలని కోరుతున్నారు. ఆస్పత్రికి అండ దండగా ఎంతటి పెద్ద రాజకీయ నాయకులు అండదండలు ఉన్నప్పటికీ ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలిచి ఆస్పత్రిని కలెక్టర్ సీజ్ చేయాలంటున్నారు.



**విచారణ చేపట్టిన అధికారులు..**

కడుపు నొప్పితో వచ్చిన వ్యక్తిని కాటికి పంపిన బంధన్ ఆస్పత్రిపై ఎట్టకేలకు హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. సోమవారం సాయంత్ర డీఎంహెచ్ఓ అప్పయ్య ఇతర అధికారులతో కలిసి ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి యాజమాన్యంతో చర్చించి వివరాలు సేకరించారు. పూర్తి సమాచారాన్ని జిల్లా కలెక్టర్ కు అందజేయనున్నట్లు ప్రకటించారు.

# మాట ఇస్తే తప్పకునేదే లేదు

- ప్రతి పనిని చిత్తశుద్ధితో పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- భూమి పూజ చేసిన మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి పనిని చిత్తశుద్ధితో పూర్తి చేయడమే కాకుండా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. తాను ములుగు నియోజకవర్గంలోని ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నానని స్పష్టం చేశారు. సోమవారం మంగపేట మండలం శనగ కుంట గ్రామంలో అగ్నిమాపక బాధితులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన అగ్ని ప్రమాదంలో శనిగ కుంటలోని కొన్ని కుటుంబాల వారు సర్వస్వం



కోల్పోగా ఆ క్షణమే కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బాధితకుటుంబాలకు వంట సామాన్లతో పాటు బట్టలను అందజేయడం జరిగిందన్నారు. 300 స్వచ్ఛంద సంస్థలతో బాధిత కుటుంబాలకు సహాయం అందించామన్నారు. అగ్నిమాపక బాధితులు ధైర్యం కోల్పోకుండా ఆత్మవిశ్వాసం కల్పించడానికి ప్రత్యేక సహాయ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఐటీడీఏ ద్వారా ఆర్థిక



సాయం అందజేయడం జరిగిందని తెలిపారు. గతంలో తాను ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడ నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కానీ పేదలు ఆందోళన చెందవద్దన్నారు. రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జి, తాసిల్దార్ రవీందర్, ఎంపీడీవో, ఆయా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రి..**

మంగపేట మండలంలోని మల్లూరు గుట్టలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద రానున్న రోజుల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మంత్రి సీతక్క ములుగు కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధికార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జి, మంగపేట మండలం తహసీల్దార్, సంబంధిత అధికారులు, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధికి రాజీలేని పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి
- జిల్లా మహాసభల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** జిల్లా సమగ్ర అభివృద్ధికై సీపీఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని, హసన్ పర్తి మండల కేంద్రంలో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. సోమవారం హసన్ పర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ హనుమకొండ జిల్లా 2వ మహాసభల వాల్ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలక పార్టీలు విఫలం అయ్యాయని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం అయిందని, దేశాన్ని కార్పొరేట్ లకు తాకట్టు పెట్టి దివాళా తీయించిందని అన్నారు. మోడీ నమ్మిన బంటు ఆదానీకి ప్రభుత్వ రంగ సంస్థలను దోచి పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం జరిగిన పోరాటంలో సీపీఐదే ఉమ్మడి జిల్లాలో అగ్రగామి పాత్రని, గ్రామాల్లో ఉపాధి హామీ, పట్టణాల్లో మున్సిపల్ వర్కర్స్, సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై, నిలువ నీడలేని పేదలకు ఇండ్ల స్థలాల కోసం గుడిసెల పోరాటాలు నడిపింది సీపీఐ అని, జిల్లా సమగ్ర అభివృద్ధికై సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ నెల 26, 27 తేదీలలో హసన్ పర్తి మండల కేంద్రంలో సీపీఐ జిల్లా 2వ మహాసభలు జరగబోతున్నాయని, జిల్లాలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని, ఈ మహాసభల్లో మొదటి రోజు మే 26న ప్రజా ప్రదర్శన – బహిరంగ సభ ఉంటుందని, ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు లు హాజరు కానున్నారని తెలిపారు. ఈ మహాసభల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీపీఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, నేదునూరి రాజమౌళి, రాష్ట్ర సమితి సభ్యులు నద్దునూరి అశోక్ స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, బత్తిని సదానందం, కొట్టేపాక రవి, మాలోత్ శంకర్, కొట్టే వెంకటేష్, దామెర సుదర్శన్, మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, నాయకులు వస్కుల భరత్ పాల్గొన్నారు.




## వైభవోపేతంగా వేణుగోపాల స్వామి జాతర

### ముగిసిన బ్రహ్మోత్సవాలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** శ్రీ రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామి జాతర మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవారం వైభవోపతంగా జరిగింది. దీంతో వేణుగోపాల స్వామి ఆధ్యయన బ్రహ్మోత్సవాలు ముశాసాయి. ఆదివారం రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామి కళ్యాణాన్ని ఆలయ అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు భక్తజన సందోహం మధ్యన కనుల పండువగానిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి పులకరించాలి దీంతో ఆలయం గోవిందా వేణుగోపాలస్వామి నామస్మరణ మార్మోగింది. వ్యాస పౌర్ణమి పురస్కరించుకుని జరిగిన వేణుగోపాల స్వామి జాతరలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేణుగోపాలస్వామి ఆలయం ఎడ్ల బండ్లతో భక్తులు ప్రదక్షిణలు చేశారు. పలు గ్రామాల భక్తుల చేత ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది ఆలయ ప్రధానార్చకులు మాధవమూర్తి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.



## ధనుంజయ్ రెడ్డిపై కేసులు ఉపసంహరించుకోవాలి

**కాంగ్రెస్ నేత అంబాల రాజు డిమాండ్**



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** సాక్షి తెలుగు దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్షపూరితంగా నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని, అలాగే ఆయనకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అంబాల రాజు డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సమాచారాన్ని అందించేందుకు జర్నలిస్టులు నిష్టతో పనిచేస్తున్న సమయంలో, వారికి అక్రమ కేసులు పెట్టి మానసిక హింసకు గురిచేయడం ఎంతమాత్రం సమంజసమైనది కాదన్నారు. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం దురదృష్టకరమని, ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లడంలో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని, అలాంటి సమయంలో సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై నోటీసులు ఇవ్వకుండానే అక్రమంగా చొరబడి సోదాలు జరపడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని అంబాల రాజు తీవ్రంగా విమర్శించారు.

# సీపీఐ ఆధ్వర్యంలో వడ్ల కల్లాల సందర్శన

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వడ్ల కల్లాలను సందర్శించారు. మండలంలోని కంచరపల్లి, ఖిలాసాపురం, అసరాపల్లి వంటి పలు సెంటర్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు కావటి యాదగిరి మాట్లాడుతూ, వడ్ల సెంటర్లలో ఓర్లు వేసినప్పటికీ గత నెల రోజులుగా వడ్ల కొనుగోలు జరుగకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వర్షాల కారణంగా వడ్లు తడిపోతుండడంతో రైతులకు నష్టం కలగనున్నట్టు ఆయన పేర్కొన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని, వెంటనే డబుల్ కాటన్ బస్తాలను ఏర్పాటు చేసి, రెండు రోజుల్లోపు వడ్లను పూర్తిగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. లేదంటే వానల వలన వడ్లు నాశనమై రైతులు భారీ నష్టాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాలుకపల్లి దావీదు, మడికంటి సోమన్న, కందుకూరు మల్లేశం, పసర దానియేలు, గొంగళ్ల దానియేలు, చిట్యాల ఉప్పలయ్య, నీలారపు సాంబయ్య, గుంగళ్ల వెంకటయ్య, కాగితాల రాములు, ముప్పిడి ఎల్లయ్య, సులుగు రమేష్, గురు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



## జలదాన కేంద్రం ప్రారంభం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వన్నాల అరవింద్ కుమార్ సమైక్య ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన జలదానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని రిబ్బన్ కట్ చేసి జలదాన శిబిరాన్ని ప్రారంభించారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహాన్ని తీర్చడం కోసం డాక్టర్ వన్నాల వెంకటరమణ జల దాన శిబిరాన్ని ఏర్పాటు చేసి, ప్రజలకు చల్లని తాగునీరు అందించి, వందమందికి చల్లని మజ్జిగ ప్యాకెట్లు అందించడం జరిగింది. వాక్ సమైక్య ఫౌండేషన్ గత 18 సంవత్సరాలుగా జిల్లాలో పాలు సేవ కార్యక్రమలు నిర్వహిస్తూ, ప్రజల మన్నలను పొందుతూ సమాజ సేవలో ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల దీన్ దయల్, మైదం సుదర్శన్, వెనిశెట్టి రోహిత్, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డీఎంహెచ్ఓకు సమ్మె నోటీస్ అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** డీఎంహెచ్ఓ డాక్టర్.బీ.సాంబశివరావుకు ఆయన కార్యాలయంలో సోమవారం ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రామ రాజేష్ ఖన్నా సమ్మె నోటీస్ అందజేశారు.ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ మే 20న ఉదయం 10 గంటలకు ఇందిరా పార్క్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల హక్కుల సాధన కై నిర్వహించే ఇందిరా పార్క్ మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఎన్.హెచ్ఎంలో 78 క్యాడర్స్ లో పని చేస్తున్న 17541 ఉద్యోగులను ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్, కనీస వేతనం 26,000 ప్రకటించాలని, (ఎమ్.హెచ్.ఎస్.ఆర్.బీ) మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ద్వారా ఎగ్జామ్స్ రాసిన అభ్యర్థుల మార్కులు, ప్రొవైజనల లిస్ట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పై సమస్యల పైన శాశ్వత పరిష్కారం కొరకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులందరూ ఒక్కరోజు మహాధర్నా హైదరాబాద్ ఇందరా పార్క్ లో ఈనెల 20న పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఏఐటీయూసీ సహాయ కార్యాదర్శి తాళ్లపెల్లి జాన్ పాల్, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జన్ను రాజు, డాక్టర్ మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## గోమాతలకు దాన బస్తాలు అందజేత



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల గోశాల గోమాతలకు అమెరికా కాలిఫోర్నియాలో నివాసముంటున్న అట్లూరి తులసి పునీత్ దంపతులు దాన బస్తాలను అందజేశారు. అట్లూరి తులసి తల్లిదండ్రులు అట్లూరి ఉదయలక్ష్మి జగన్ మోహన్ రావు దంపతులు సోమవారం పర్వదినం సందర్భంగా తులసి పునీత్ దంపతుల పేరున అభిషేకం నిర్వహించారు. అనంతరం దాన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందజేశారు. గోమాతలకు దాన బస్తాలను అందజేసిన తులసి, పునీత్ దంపతులకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# కాళేశ్వరం ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక జరిగింది. సోమవారం ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా రెవెల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా నాగుల సంతోష్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ వాలి, ఇనుముల సడవలి, సంయుక్త కార్యదర్శిగా తోట చంద్రశేఖర్, కోశాధికారిగా భాస్కర ఆచార్యులు, కార్యదర్శిగా కామిడి భాస్కర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కీర్తి శ్రావణ్, నీలం శ్రీకాంత్, కోరుకొప్పుల సదాశివ్, ఆరవెల్లి సంపత్ కుమార్, రేవెల్లి రాజబాపు, కొండగొర్ల సంతోష్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టాఫర్లు తడక సుధాకర్ గౌడ్, పావుశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కోటగుళ్లలో భూపాలపల్లి సీఐ దంపతుల పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో వైశాఖమాస వ్యాస మాస పౌర్ణమి సోమవారం పర్వదిన సందర్భంగా వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భూపాలపల్లి సిఐ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్, లక్ష్మి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి, నందీశ్వరుని పూజ అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. అనంతరం గోశాలకు, గోమాతను అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు.

# మాజీ ఎంపీపీ కూతురి వివాహ వేడుక

## హాజరైన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, ఎంపీ కవిత



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండల మాజీ ఎంపీపీ ధరంసోత్ బాలు నాయక్ భారతిల కూతురు ధరణి(శ్రావ్య) ఉపేందర్ల వివాహ వేడుక చిల్కోడు శివారు తెల్లబండ తండాలో అత్యంత వైభవంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, ఎంపీ కవిత, మాజీ సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, భారాస నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. దాంపత్య జీవితం పిల్లపాపలతో ఆనందంగా సాగాలని కోరారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన(68) మంది వ్యక్తులను మేజిస్ట్రేట్ అబ్బోజు. వేంకటేశం ఎదుట హాజరు పరచగా శ్రీరాముల శ్రీనివాస్ కు రెండు రోజుల జైలు శిక్ష పడగా హుజురాబాద్ సబ్ జైలుకు పంపి, మిగతా (67) మంది వ్యక్తులకు రూ.81,500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. రామకృష్ణ తెలిపారు.

# వైద్యారోగ్య రంగంలో నర్సింగ్ సేవలు కీలకం

## ■ ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రపంచ నర్సింగ్ డే సందర్భంగా ఐఎన్.టీ.యూసీ 3194 యూనియన్ యం జీ యం బ్రాంచ్ కమిటీ జనరల్ సెక్రటరీ ప్రీతి సజనీ, వర్కింగ్ ప్రెసిడెంట్ యం. డి సల్మా, కోశాధికారి యస్. రాజ్య లక్ష్మి, అసోసియేట్ ప్రెసిడెంట్ కార్తీక్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంజీఎం సూపరింటెండెంట్ డా.కిషోర్, ఆర్ఎంఓలు డా. శశి కుమార్, డా.వాసం శ్రీనివాస్, ఐ.ఎన్.టీ.యూ.సీ 3194 స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అండ్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ బత్తిని సుదర్శన్ గౌడ్ లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, పూల మాల వేసి, కేక్ కట్ చేసి మాట్లాడారు. ఎంజీయం ఆస్పత్రిలో పని చేస్తున్న నర్సింగ్ ఆఫీసర్స్, ఇతర అన్ని క్యాడర్ ల ఉద్యోగుల సమస్యలన్నింటినీ పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఐఎన్ టీయూసీ 3194 యూనియన్ ఆధ్వర్యంలో హెల్త్ మినిస్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ నర్సింగ్



సూపరింటెండెంట్ కే.దయా శీలను శాలువా కప్పి, పూల భోకే ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ తిరుమల దేవి నళిని, దీప్తి, పద్మలత, నాగలక్ష్మి, సునీత, సుధావాణి, నిర్మల మేరి, ఐఎన్ టీయూసీ జిల్లా జనరల్ సెక్రెటరీ వీరేందర్, వరంగల్ జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్ ప్రెసిడెంట్ నార్ల వేణు, జూనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ శివ పార్వతి, సుజీవన్, సందీప్, అనిల్, పద్మ, వందన, గీత, ప్రమీల, మంజుల తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### సంరక్ష హాస్పిటల్ లో..

ప్రపంచ నర్సింగ్ డే సందర్భంగా సోమవారం సంరక్ష హాస్పిటల్ లో నర్సులు పెద్దఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నర్సుల త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. డాక్టర్లు ప్రాణాలు నిలిపితే వారికి సేవ చేయడంలో నర్సులు ప్రముఖ పాత్ర పోషిస్తారన్నారు. నర్సుల సేవలు మరువలేనివని కొనియాడారు.

# ప్రారంభమైన హిందూ బాల సంస్కార శిక్షణ వర్గ

**వరంగల్ వాయిస్, జనగామ :** విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హిందూ బాల సంస్కార శిక్షణ వర్గను సోమవారం వైభవంగా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ తరగతులను ఏర్పాటు చేశారు. ప్రముఖ కవి, అధ్యాపకులు గంగరాజు శ్రీనివాస్ రావ్ అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులు ప్రారంభించారు. నిర్వాహకులు మోహనకృష్ణ మాట్లాడుతూ చైతన్యవంతమైన హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యంగా బాల్య దశలోనే పిల్లలను ఆదర్శవంతమైన, సంస్కారవంతమైన భవిష్యత్తు వైపు నడిపించేందుకు ఆధ్యాత్మిక, ధార్మిక, చారిత్రక అంశాలతో అనేక శ్లోకాలు, స్తోత్రాలు, కీర్తనలు, సుభాషితాలు వంటి ఆసక్తికర ప్రణాళికతో ప్రతీ రోజు ఒక ప్రత్యేక వక్త అతిథిగా పాల్గొని నూతన అంశాలను, అనేక విషయాలను బోధించనున్నారని తెలిపారు. అతిథి శ్రీనివాస్ రావ్ మాట్లాడుతూ భవిష్యత్ తరాన్ని పటిష్ఠపరచేందుకు, హిందూ సమాజ చైతన్యం కోసం విద్యార్థి దశలోనే బీజం వేయడం అద్భుత ప్రణాళిక అని, కేవలం గంట నిడివిలో ఐదు విభాగాలుగా విషయ బోధన ఆశ్చర్యకరంగా సాగుతుందని అభినందించారు. సనాతన సాంప్రదాయాలను, సంస్కృతులను



కాపాడుకోవాలని అన్నారు. దేవాలయ గౌరవాధ్యక్షులు గజ్జెల నర్సిరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి అద్భుత కార్యక్రమంలో తమ పిల్లలందరూ తప్పకుండా పాల్గొనేలా ప్రయత్నించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ తరగతుల్లో వేముల సదానందం "హిందూ సంస్కృతీ, సాంప్రదాయాలు, మన ప్రాచీన వైభవం, ధర్మ విశిష్టత" అనే అంశంపై ప్రసంగించారు. నిర్వహాకులు చిలువేరు హర్షవర్ధన్, ఉల్లెంగుల రాజు, మైలారం శ్రీనివాస్, సాయికుమార్, యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, అంబటి బాలరాజు ఇట్టబోయిన రాజు, అశోక్, అన్నెబోయిన, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# విలేజ్ డెకాయిట్ కమిటీలుగా మారిన వీడీసీలపై న్యాయ పోరాటం

## ➲ ఐఎల్ పీఏ నిజ నిర్ధారణ బృందం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రామ అభివృద్ధి కమిటీల పేరుతో దౌర్జన్యాలకు పాల్పడుతూ విలేజ్ డెకాయిట్ కమిటీలుగా మారిన వీడీసీలపై న్యాయ పోరాటం చేస్తామని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ బృంద నాయకులు పొన్నం దేవరాజ్ గౌడ్, శాంసన్, వి ఎం కృష్ణ, సాయిని నరేందర్, అనంత ఆంజనేయులు, రాజారామ్, సుమలత, కందుకాల సురేష్, వెంకటేష్ ప్రసాద్, రాజశేఖర్ లు తెలిపారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడు మండలం తాళ్ళరాంపూర్ లో భారత్ ముక్తి మోర్చా నాయకులు రాజేష్ రక్షక్ అధ్యక్షతన సోమవారం జరిగిన నిజ నిర్ధారణ సమావేశంలో వారు పాల్గొని బాధిత ప్రజల నుండి వివరాలు తెలుసుకొని మాట్లాడారు. మోర్తాడ్ మండలంలో వీడీసీ నాయకులు గత సంవత్సరం కాలంగా ఎన్నో దౌర్జన్యాలకు పాల్పడుతూ అణగారిన ప్రజలను సంఘ బహిష్కరణలు చేసి భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. గత సంవత్సర కాలం నుంచి తాళ్లరాంపూర్ లో ఆధిపత్య కులాల వారు వీడీసీ పేరుతో భూమి సమస్యను సృష్టించి, గౌడ కులస్తులను తాళ్లు ఎక్కాలని బలవంతం చేశారని, తాళ్లు ఎక్కకుంటే ఐదు లక్షల రూపాయల అపరాధ రుసుం చెల్లించాలని ఒత్తిడి చేశారని వాపోయారు. పెనాల్టీ కట్టనందుకు గౌడ కులస్తులను గ్రామ బహిష్కరణ చేశారని, తాటి చెట్లను, ఈత వనాన్ని తగలబెట్టి భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. వి.డి.సి నాయకులు అంతటితో ఆగకుండా శ్రీరామ నవమి రోజున నవమి ఉత్సవాల్లో పాల్గొన్న గౌడ మహిళలను ఆ ఉత్సవాల నుంచి అగౌరవంగా బహిష్కరించి అవమానించారని బాధిత మహిళలు తెలిపారు. వీడీసీల దౌర్జన్యాలపై గత మూడు నెలల నుంచి పోలీసులకు ఎన్ని



ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వీడీసీ నాయకులు అందరూ ఆధిపత్య కులాల వారైనందునే వారికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. జనబలం కలిగిన ఆధిపత్య కులాల దౌర్జన్యాలకు చిన్న కులాల వారు ఎన్నో బాధలు పడుతున్నారని, వీడీసీ పేరున ఆధిపత్య కులాల వారు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని, ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారని తెలిపారు. పోలీసులు ప్రకటనలకే పరిమితమవుతున్నాని, స్థానిక ఎమ్మెల్యే ఇతర నాయకులు ఎవరూ కూడా స్పందించడం లేదన్నారు. ఈ సందర్భంగా ఐఎల్ పీఏ బృంద నాయకులు మాట్లాడుతూ వి.డి.సి దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాడాలని, జనబలం కలిగిన కులాల ఆధిపత్యం పోవడానికి న్యాయ పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నిర్వహించిన నిజ నిర్ధారణ కమిటీ ముందు భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ బట్టు, భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాజేష్ రక్షక్, మాజీ సర్పంచ్ రామాగౌడ్,మాజీ ఎంపీటీసీ సుదర్శన్ , గౌడ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, నాయకులు లలిత, కళ్యాణి, సంతోష , మౌనిక, నారాగౌడ్, సత్యనారాయణ , శ్రీనివాస్ , పెద్ద గంగాధర్ , తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే నాగరాజు సమీక్ష



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వచ్చే వర్షాకాలం నాటికి చెరువులు, కుంటలు, కెనాల్లు పరిరక్షణ కోసం అలాగే వర్షాకాలంలో కురిసే నీటిని చెరువులు, కుంటలు నింపుకొని వాటి సంరక్షణ, రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని సోమవారం హనుమకొండ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఇరిగేషన్ శాఖ అధికారులతో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. నాయకులు తమ మండల, గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వారి ముందే విషయాలను ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో చెరువులు, కుంటలు, కెనాల్లు పరిరక్షణ కోసం అధికారులు బాధ్యతగా తీసుకొని తగు చర్యలు తీసుకోనీ వర్షాకాలం నాటికి రైతులకు ఏ సమస్య లేకుండా చూడాలని అలాగే ఎవరైనా కాలువలను తూములను విధ్వంసం, కబ్జాలకు గురికాకుండ చూడాలని సూచించారు. ఏవరైనా అలా చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అలాగే మున్సిపల్ పరిధిలో ఉన్న నాళాలను రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు అక్రమాలు పాల్పడుతున్నారని వాటిని పరిరక్షించాలని అధికారులకు ఎమ్మెల్యే నాగరాజు సూచించారు. అలాగే ఇరిగేషన్ శాఖ అధికారులు ఏ పెండింగ్ సమస్య ఉన్న తమ దృష్టి తీసుకొని వస్తే ఇరిగేషన్ శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్చించి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని అధికారులు ఎవరూ అలసత్యం వహించకుండా పనులు చేయించి రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈలు, డీఈలు, ఏఈలతో పాటు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్వేతార్కలో నూతన కాజీపేట ఏసీపీ పూజలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట స్వయంభు శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయ దివ్య క్షేత్రంలో సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన కాజీపేట పట్టణ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పింగిలి ప్రశాంత్ రెడ్డి దేవాలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఏసీపీకి పూర్ణ కలశ మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికి ఆది గణపతి స్వామి వారి దర్శనం చేసుకొని అనంతరం దేవాలయంలో కొలువు ఉన్న 29 దేవత మూర్తులను దర్శించుకున్నారు. అనంతరం ప్రధాన దేవాలయం స్వయంభు శ్రీ శ్వేతార్కపూల గణపతి స్వామి వారి వద్ద దేవాలయ పరిపాలన నిర్వాహకులు అయినవోలు సాయి కృష్ణ శర్మ శ్వేతార్క అష్టోత్తర అర్చన పూజ కార్యక్రమ క్రతువుని నిర్వహించడం జరిగింది. అనంతరం మహా మంగళ నిరాజనం,స్వామివారి శేష వస్త్రము స్వామివారి చిత్రపటం చిత్రమాలిక అందించారు. అలాగే మహా ఆశీర్వచనం, తీర్థ ప్రసాదం అందించారు. ఇందులో స్థానిక కాజీపేట పోలీసులు, అధికారులు, దేవాలయ సిబ్బంది మేనేజర్ లక్క రవి, పీఆర్వో మణి, పద్మ, ధ్రువంత కృష్ణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాస్యులైన మహిళలతోనే దేశాభివృద్ధి తోడ్పాటు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని భీంపల్లి పాఠశాలలో గ్రామస్థాయి స్వయం సహాయక బృందాల మహిళలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ మహిళల చదువుల అవసరాన్ని వివరిస్తూ, ప్రభుత్వం అందిస్తున్న అనేక విద్యా సదుపాయాలను వివరించారు. ఉల్లాస్ యాప్, ఎన్ఐఎల్పీ (NLPI)కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి మాట్లాడుతూ నిరక్షరాస్యులైన మహిళలకు చదవడం, రాయడం నేర్పించడం ద్వారా, అలాగే చదువు మానేసిన విద్యార్థులను మళ్లీ పాఠశాలలు, కాలేజీల్లో చేర్పించడం వంటి చర్యల ద్వారా 100 శాతం అక్షరాస్యత సాధించవచ్చని అన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటికొండ వీరస్వామి మాట్లాడుతూ అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించడంతో పాటు ఉల్లాస్ యాప్ ఉపయోగాల గురించి తెలియజేశారు. మహిళలు అక్షరాస్యులైతే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, దాని ద్వారా దేశ అభివృద్ధికి కూడా తోడ్పాటు అందుతుందని చెప్పారు. రాబోయే విద్యా సంవత్సరంలో తమ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ భీంపల్లి ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, గోపాల్ రెడ్డి, జనార్ధన్, రమాదేవి, సుమ, శైలజ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, జ్యోత్స్న, సుజాత, అంగన్వాడి టీచర్లు వరలక్ష్మి, సులోచన, ప్రీ ప్రైమరీ టీచర్ పూజిత, వీఓఏ, వీఓ మమత, జ్యోతి, త్రివేణి, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మురళి నాయక్ త్యాగం మరువబోం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** దేశ రక్షణలో తన ప్రాణాలను తృణప్రాయంగా భావించి పాకిస్తాన్ సైన్యంతో ధైర్యంగా పోరాడి, అనేక మంది శత్రు సైనికులను హతమార్చి చివరకు వీర మరణం పొందిన తెలుగు రత్నం మురళి నాయక్ ను దేశ ప్రజలు ఎప్పటికీ మరవరని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. ముకుంద కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కార్పొరేటర్ రవి, “భరతమాత కోసం తన ప్రాణాలు అర్పించిన మురళి నాయక్ చిన్న వయస్సులోనే వీర మరణం పొందడం ఎంతో దురదృష్టకరం. అయితే, ఆయన చూపిన దేశభక్తి ప్రతి భారతీయుడికి ప్రేరణగా నిలవాలి” అన్నారు. ప్రతి పౌరుడు దేశానికి అండగా నిలవాలని, అత్యవసర సమయంలో ప్రభుత్వం పట్ల సంఘీభావం చూపాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. కొవ్వొత్తుల ర్యాలీ ముకుంద కాలనీ నుంచి ప్రారంభమై మెయిన్ రోడ్ చౌరస్తా వద్ద ముగిసింది. అక్కడ మురళి నాయక్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించడంతో పాటు, రెండు నిమిషాల మౌన ప్రార్థన పాటించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు వినయ్, నాగరాజు, భాస్కర్, వెంకన్న, నరేష్, ఉల్లి కవిత, డాక్టర్ కృష్ణవేణి, రజిత, సాహితీ, స్వప్న, పద్మ, అన్నపూర్ణ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి

◆ తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక సంస్థలలో, విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచుతూ రాష్ట్ర ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లులు, రాష్ట్ర గవర్నర్ ఆమోదించి, రాష్ట్రపతికి పంపించబడినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును కాలయాపన చేయకుండా ఆమోదించి, తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి చట్టంగా మార్చాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. అగ్రవర్ణాల పేదలకు 10శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, బీసీలకు తీరని అన్యాయం చేస్తున్నదని ఆయన అభిప్రాయపడ్డారు. వెంటనే ఈ 10శాతం రిజర్వేషన్లను రద్దు చేసి, బీసీలకు పూర్తిగా న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ ఉద్యమాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం జన గణనలో కులగణన చేయాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఇప్పటివరకు ఆ ప్రణాళికపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని ఆయన చెప్పారు. అందుకే, కేంద్రం జనగణనలో కులగణనను ప్రారంభించి, పూర్తి చేయడానికి నిర్దిష్టమైన కాలపరిమితిని ప్రకటించాలన్నారు. అన్ని రంగాలలో అన్యాయం ఎదుర్కొంటున్న బీసీలకు చట్టసభలలో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళా కోటాను నిర్ణయించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. అంతేకాక, బీసీ సంక్షేమానికి సంబంధించి తక్షణమే బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, దానికి రెండు లక్షల కోట్ల నిధులను కేటాయించి, బీసీల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా బీసీల డిమాండ్స్ నిర్లక్ష్యంగా ఉంటే, “కొరివి తోతల గోక్కున్నట్టే” పోరాటాలు ఉధృతమవుతాయని వెంకట్రాములు హెచ్చరించారు.

# సాగంటి మంజులకు ‘కళా కిరీటి అవార్డ్’



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ గోపాలపురానికి చెందిన ఆర్టిస్ట్, లెక్చరర్, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు మంజులకు ఆదివారం ఏలూరు ఆంధ్రప్రదేశ్ లో “కళా కిరీటి” అవార్డ్ అందజేయడం జరిగింది. ఏలూరులో శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 48 గంటల పాటు జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో తెలుగు భాషకు, కళలకు సేవ చేస్తున్న కవులను, రచయితలను, కళాకారులను గుర్తించి, వారికి ఈ అవార్డ్ అందించడం జరిగింది.. ఇందులో 400 పైగా కవులు కళాకారులు పాల్గొనగా అంతర్జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ఈ అవార్డ్స్ అందజేశారు.ఈ సందర్భంగా కవులు కళాకారులు, పలువురు మంజులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంటి నెంబర్లు ఇవ్వాలి




**వరంగల్ వాయిస్, జనగామ :** వీరనారి ఐలమ్మ నగర్ మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులు ప్లాట్ కలిగి ఇల్లు కట్టుకొని కబ్జాలో ఉన్న ప్రతి ఒక్కరికి మున్సిపల్ ద్వారా మ్యుటేషన్ చేసి ఇంటి నెంబర్లు ఇవ్వాలనీ, గృహలక్ష్మి ద్వారా ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలనీ, మిషన్ భగీరథ వాటర్ పైపులు లైన్ ద్వారా మంచినీళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్నిసీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జనగామ సీపీఎం పట్టణ కార్యాలయంలో జోగు ప్రకాష్, సీపీఎం జనగాం పట్టణ కార్యదర్శి అధ్యక్షతన మూడో విడత ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మొక్కు కనకారెడ్డి పాల్గొని మాట్లాడుతూ మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేసి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2012-2013 సంవత్సరంలో ఇచ్చిన ఇందిరమ్మ పట్టా లబ్ధిదారులకు 5 లక్షల రుణం గృహలక్ష్మి ద్వారా ప్రత్యేక అవకాశం కల్పించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కమిటీ సభ్యులు బాల్నే వెంకట మల్లయ్య, ఎండీ గౌసియా, ఏనుగుల కమల, బండ సౌందర్య, మున్సిపట్ల జయ, ఎర్ర రజిత, పద్మ జ్యోతి, మల్లేష్, కవిత, సుజాత, చింతల శ్రీలత, అంజమ్మ, రజిత, కొన్నే శాంత, కచ్చగళ్ల వెంకటేష్, మాదాసి సుధాకర్, బాలస్వామి, పాల్వాయి పద్మ, మమత పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, మే 12, 2025

## సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించుటకు ప్రభుత్వం రూ.6000 కోట్లతో ఐదు లక్షల మందికి రుణాలు ఇవ్వాలని నిర్ణయం చేసి దరఖాస్తులు స్వీకరించగా, దరఖాస్తులు పూర్తి అయిన తరువాత సివిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం బాధాకరమన్నారు. పేద మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సివిల్ స్కోర్ నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలని, అర్హులైన వారందరికీ ఈ పథకాన్ని వర్తింపచేయాలన్నారు.

## ఎఫ్ సెట్ ఫలితాల్లో 'శివాని' విజయ దుదింభి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిన్న విడుదలైన ఎఫ్‌సెట్ ఫలితాల్లో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి అద్భుత విజయాన్ని నమోదు చేశారు. కళాశాల విద్యార్థులలో అరికిల్ల నిస్సీ 1309, ఆరే హాసిని 1352, కోరే ఓంచందర్ 2592, పాడి శ్రీవాణి 2785, గుగులోత్ తరుణ్ 3299, గుగులోత్ రమేశ్ 3988, సాల్మా 4527, మారం లక్ష్మణ్ 4533, చంద్రశేఖర్ రాయ్ 6680, దాడి నవ్య 6779, ఎంబడి సింధు 8189, వంగర ఆదిత్య 8697, గుగులోత్ చందన 8981, బదావత్ సింధు 9016, కావేటి వర్ష 9297, లాడే జీవన్ 9971, వరుకోలు అనుష్క 10223, పోరెడ్డి హర్షవర్ధన్ 10409 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ టీ. స్వామి మాట్లాడుతూ, "గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు సమానంగా మంచి ఫలితాలు సాధిస్తున్న శివాని, ఈసారి కూడా ఎఫ్‌సెట్ ఫలితాల్లో చరిత్రను తిరగరాసింది" అని తెలిపారు. విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని డైరెక్టర్లు జీ. సురేందర్, వీ. చంద్రమోహన్, టీ. రాజు, ఎన్. రమేశ్, ఏ. మురళీధర్, వీ. సురేశ్, ఎస్. సంతోష్ రెడ్డి, ప్రిన్సిపాళ్లతో కలిసి విద్యార్థులను అభినందించారు. ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా షష్టిపూర్తి మహోత్సవం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** రఘునాథపల్లి గ్రామ ముద్దుబిడ్డ, ప్రముఖ వ్యాపారవేత్త, సమాజ సేవకులు, మార్గదర్శకులైన కూరెళ్ల రేణుక–ఉపేందర్ గుప్త దంపతుల షష్టిపూర్తి మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి పద్మశాలి వారిని ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కూరెళ్ల దంపతులు నూతేళ్లు ఆయురారోగ్యాలతో జీవించి, తమ ఆధ్యాత్మికతతో, సేవా కార్యక్రమాలతో ఇంకా చాలా మందికి ఆదర్శంగా నిలవాలని" ఆకాంక్షించారు. అలాగే, "ఆయుష్య బివృద్ధి రస్తు, ఆర్థిక అభివృద్ధి రస్తు, మనో వాంఛా ఫలసిద్ధి రస్తు" అంటూ శుభాశీస్సులు తెలిపారు. ఈ వేడుక సందర్భంగా గ్రామస్థులు, కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా బుద్ధ పూర్ణిమ



**వరంగల్ వాయిస్, కేయూ :** బుద్ధ పూర్ణిమ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ గ్రంథాలయ ప్రాంగణంలోని గౌతమ బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గౌతమ బుద్ధుడికి సంబంధించిన పుస్తకాల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వసతి గృహ సంచాలకులు డాక్టర్ ఎల్.పి. రాజ్ కుమార్ మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు బోధనలు నేటి తరానికి అవసరమన్నారు. విద్యార్థులు ఆయన బోధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ ఆర్. భారవి శర్మ, డాక్టర్ సోమయ్యతో పాటు లైబ్రరీ అసిస్టెంట్ తేజావత్ జావేర్, ప్రభాకర్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనపూర్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- కడియం నువ్వు చేసిందేమీ లేదు
- ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా
- సవాల్ విరిసిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి తానే బేస్ వేసినట్టు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డా. తాటికొండ రాజయ్య తెలిపారు. రఘునాథపల్లి మండలంలోని కన్నయ్యపల్లి గ్రామాన్ని సోమవారం సందర్శించిన ఆయన, గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మాజీ మంత్రి కడియం శ్రీహరి చేసిన అభివృద్ధి శూన్యమని, ఆయన దళిత ద్రోహి అని తీవ్రంగా విమర్శించారు. "నువ్వు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా... స్టేషన్ ఘనపూర్ అభివృద్ధిపై ముఖాముఖి చర్చకు సిద్ధమా?" అంటూ సవాల్ విసిరిన రాజయ్య, కడియంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అలానే, కాంగ్రెస్ పార్టీలో అధికారులు, పోలీసులతో సంబంధాలు పెంచుకునే తతంగమే తప్ప ప్రజల కోసం ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టలేదని రాజయ్య ఆరోపించారు. "18 నెలలు అధికారంలో ఉన్న కడియం 18 పైసలు కూడా ప్రజల కోసం ఖర్చు పెట్టలేదు," అని ఆయన ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, మండల పార్టీ ఇంచార్జి వై.కుమార్ గౌడ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మున్సిపల్ విజయ్, ఇతర పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### పైలెట్ గ్రామంలో అమలు కానీ పథకాలు..

నేను అభివృద్ధి చేయట్లేదు అని మాట్లాడుతున్న కడియం శ్రీహరి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని బొడ్రాయి వద్ద బహిరంగ చర్చకు సిద్ధమా.......! నేను చేసిన అభివృద్ధి గణాంకాలతో నేను వస్తా...నువ్వేం చేసావో ఆ గణాంకాలతో నువ్వు రా.. కేసిఆర్ గారి కుటుంబం గురించి ఇంకో సారి మాట్లాడితే అసలు ఊరుకోం.... కబడ్దార్... నన్ను కోసిన పైసా లేదు అని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి 200 కోట్లు పెట్టీ అందాల పోటీలు ఎలా నిర్వహిస్తున్నారు. ఆ అందాల పోటీలకు కడియం శ్రీహరి మద్దతు తెలపడం పట్ల సిగ్గుండాలి... ఒక వైపు రైతుల వడ్లు కొనక అల్లాడి పోతుంటే దాని గురించి మాట్లాడడం మానేసి అందాల పోటీల వల్ల పెట్టుబడులు వస్తాయని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాడు. ఇందిరమ్మ ఇండ్ల లిస్టు గ్రామ సభలో సిద్ధం చేయాలి కానీ, కడియం శ్రీహరి మనుషుల ఇంట్లో కాదు. కడియం శ్రీహరి అనుచరులు చెప్పిన వారికే ఇందిరమ్మ ఇండ్లు, 10 యేళ్లు కష్ట పడిన కాంగ్రెస్ పార్టీ వారికి కూడా విలువ లేకుండా పోయింది.

## విన్నర్ గా ఈగల్ వారియర్స్ టీం

### విజేతలకు బహుమతుల ప్రదానం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో ఎల్తూరి సమృత వర్ధన్ చిన్ను ఆధ్వర్యంలో చింతల్ గ్రౌండ్‌లో నిర్వహించిన పరకాల క్రికెట్ టోర్నమెంట్ 2025 ఫైనల్ పోరాటం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈగల్ వారియర్స్ జట్టు టోర్నమెంట్ విజేతగా నిలవగా, పైడిపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమానికి పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరకాల కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, వినాయక హాస్పిటల్ యజమాని డాక్టర్ సతీష్, ఎన్ఎస్ఆర్ పవన్ కుమార్, మంద టునిట్, టాటా ఏఐజీ ప్రతినిధి మామిడి చక్రపాణి, దారా సతీష్, పిట్టా సునీల్, అఖిల్, సిద్ధు, ఏకు బాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, సోమవారం శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానం, మల్లక్కపేట ఆలయంలో ఆంజనేయ స్వామి మాలధారుల స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

## మత్స్యగిరి స్వామి దేవాలయానికి జనరేటర్

**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండల కేంద్రంలో ఉన్న ప్రసిద్ధి చెందిన పురాతన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయానికి శాయంపేట గ్రామానికి చెందిన క్రీస్తుశేషులు మామిడి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థంగా, ఆయన కుమారులు మామిడి ప్రమోద్ మరియు త్రిశూల్ సాయి కృష్ణులు కలిసి రూ. 35,000 విలువ గల జనరేటర్‌ను బహుకరించారు. ఈ జనరేటర్‌ను సోమవారం దేవాలయ చైర్మన్ సామల భిక్షపతికి అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి వేణు కల్పన పాల్గొన్నారు.



## ఎఫ్ సెట్ ఫలితాలలో 'షైన్' విజయకేతనం




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాష్ట్ర ప్రభుత్వం నిన్న విడుదల చేసిన టీజీ ఎఫ్ సెట్ 2025 ఫలితాల్లో షైన్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఉజ్వల విజయాలు సాధించారు. ఈ సందర్భంగా షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్, డైరెక్టర్లు మూగుల రమ, మూగుల రమేశ్ మాట్లాడుతూ, తమ సంస్థ వరంగల్ నగరంలోనే జేఈఈ, మెయిన్స్, నీట్, ఎఫ్ సెట్ వంటి ప్రవేశ పరీక్షల కోసం అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నదని తెలిపారు. ఈ క్రమంలో తమ విద్యార్థులు ఫలితాల్లో అద్భుతమైన ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ముఖ్యంగా డి.ఇందు 181వ ర్యాంకు, కె. సహస్ర 277వ ర్యాంకును సాధించగా, బి.సంధ్య, ఎం.రమ్య, పి. మహేశ్, ఎం.వరుణ్ సందేశ్, సీహెచ్. సిరి సహస్ర, కె. కస్తూరి, జి. నిగమ, కె.చాణక్య, కె.విష్ణు, ఎన్. శ్రీ చైతన్య, ఎం. సుశాంత్ లతో పాటు మరో 23 మంది విద్యార్థులు కూడా మంచి ర్యాంకులు సాధించారు. విజేత విద్యార్థులను సంస్థ తరపున హృదయపూర్వకంగా అభినందించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్, సంధ్య, అధ్యాపక బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒరిస్సాలో ప్రగతి పరపతి సంఘం విహారయాత్ర



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో గల రంగశాయిపేటలోని ప్రగతి పరపతి సంఘం ఆధ్వర్యంలో వెళ్లిన ఒరిస్సా రాష్ట్ర విహారయాత్రలో భాగంగా సోమవారం కోణార్క్ లోని శ్రీ సూర్యదేవాలయాన్ని రంగశాయిపేట వాస్తవ్యులైన సికింద్రాబాద్ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కంచ ప్రసాద్–చంద్రిక దంపతులు, 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ దంపతులతో పాటు కొక్కొండ భాస్కర్ వాణి, పరికిపండ్ల రాజేశ్వర్ రావు రాధ, పరికిపండ్ల రమేష్ శ్రీలత దంపతులు తదితరులు సందర్శించారు.





## ఎన్టీఆర్-నీల్ సినిమాలో శ్రద్ధా కపూర్

పాన్ ఇండియా స్టార్ జూనియర్ ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో చేస్తున్న మూవీ షూటింగ్ వేగంగా జరుగుతోంది. మొన్నటి దాకా కర్ణాటకలో ఓ షెడ్యూల్ కంప్లీట్ చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఫారిన్ టూర్ లో బిజీగా ఉన్నాడు. కాగా ఈ మూవీలో హీరోయిన్ గురించి ఎప్పుడూ ఏదో ఒక న్యూస్ వినిపిస్తూనే ఉంది. ఇప్పటికే రుక్మిణీ వసంత్ నటిస్తుందనే టాక్ ఎక్కువగా వచ్చింది. ఆమె పేరుపై ఇంకా కన్ఫర్మేషన్ రాలేదు. ఈ క్రమంలోనే మరో స్టార్ హీరోయిన్ ను ఇందులోని సెకండ్ హాఫ్ కోసం తీసుకుంటున్నారంట. సెకండ్ హాఫ్ లో కీలక పాత్ర కోసం ఆమెను తీసుకుంటున్నట్టు– తెలుస్తోంది. ఆమె ఎవరో కాదు బాలీవుడ్ బడా హీరోయిన్ శ్రద్ధా కపూర్. ఆమెకు ఇప్పటికే ప్రశాంత్ నీల్ స్టోరీ గురించి చెప్పగా దాదాపు ఓకే చెప్పేసిందంట. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రాబోతున్నట్టు తెలుస్తోంది. శ్రద్ధా కపూర్ కు అటు– బాలీవుడ్ తో పాటు– ఇటు– సౌత్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. ఆమెను ఇందులో తీసుకుంటే బిజినెస్ పరంగా కూడా కలిసొచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. శ్రద్ధా కపూర్ మొన్ననే స్త్రీ–2 సినిమాతో భారీ హిట్ అందుకుంది. ఈ పాన్ ఇండియా సినిమాలో ఆమె నటిస్తే మూవీకి మంచి క్రేజ్ పెరుగుతుందని.. హిందీ మార్కెట్ లో ఇది బాగా కలిసి వచ్చే అవకాశాలు ఉన్నట్టు– చెబుతున్నారు.

## బెంజ్ సినిమాలో ప్రియామోహన్

లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ నుండి ఇప్పటి వరకు త్రీ మూవీస్ వచ్చాయి. ఖైదీ, విక్రమ్, లియో ఈ మూడిరటికీ లోకేశ్ కనగరాజే దర్శకుడు. కథలన్నీ ఆయనవే. కానీ ఫోర్త్ ఇన్‌స్టాల్ మెంట్ మూవీ బెంజ్‌లో కొత్త దర్శకుడికి ఛాన్స్ ఇచ్చాడు లోకీ. రోమియో అండ్ సుల్తాన్ ఫేం బక్కియరాజ్ కన్నన్‌కు బెంజ్‌ను డీల్
చేసే బాధ్యతలు అప్పగించాడు. రాఘవ లారెన్స్ హీరోగా వస్తోన్న ఈ ప్రాజెక్టుకు లోకీ స్టోరీ ఇవ్వడంతో పాటు–.. ప్రజెంటర్‌గా వ్యవహరిస్తున్నాడు. బెంజ్ ఎనౌన్స్ చేసి సిక్స్ మంత్స్ దాటింది. కానీ కూలీ ప్రాజెక్టులో బిజీగా ఉన్న నేపథ్యంలో లోకేష్ కనకరాజ్ బెంజ్ కథకు మెరుగులు దిద్దలేదని తెలుస్తోంది. ఇక ఇప్పుడు అన్నీసెట్ అవడంతో బెంజ్ ను స్టార్ట్ చేసాడు. తాజా అప్డేట్ ప్రకారం నేడు ఈ సినిమాను అధికారకంగా స్టార్ట్ చేసారు. చెన్నై లో షూటింగ్ మొదలు పెట్టారు. బెంజ్‌లో లారెన్స్‌తో పాటు– సీనియర్ హీరో మాధవన్, అలాగే మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ మెయిన్ లీడ్స్‌గా కనిపించబోతున్నారు. కోలీవుడ్ భామ ప్రియా మోహన్ హీరోయిన్‌గా నటించబోతుంది. బెంజ్ అవుట్ పుట్ మరింత వయెలెంట్‌గా కథ నేపథ్యంలో రానుంది. ఇక ఈ సినిమాకు తమిళ్ నయా మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ బాణీలు సమకూరుస్తున్నారు. దీని తర్వాత ఖైదీ 2ని పట్టాలెక్కించనున్నాడు లోకీ. మరీ బెంజ్ కోసం రోలక్స్ తరహా రోల్ రీ క్రియేట్ చేశాడో, కొత్త క్యారెక్టర్ డిజైన్ చేశాడో చూడాలి.

## నందమూరి కుటుంబంలో .. మరో తారకరామారావు




నందమూరి హరికృష్ణ మనవడు, జానకీరామ్ కుమారుడు నందమూరి తారక రామారావు హీరోగా పరిచయమవుతున్న విషయం తెలిసిందే. నందమూరి వంశం నాలుగో తరం వారసుడిగా తారక్ ఎంట్రీ– ఇవ్వబోతున్నాడు. ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం సోమవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ వేడుకకు నారా భువనేశ్వరి, దగ్గుబాటి పురందేశ్వరి, గారపాటి లోకేశ్వరి తదితరులు హాజరయ్యారు. నారా భువనేశ్వరి హీరో హీరోయిన్లపై క్లాప్ కొట్టి వారిని అభినందించారు. అయితే ఈ మూవీ ప్రారంభమైన సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా తారక రామారావుకు శుభాకాంక్షలు తెలిపారు. తారక రామారావు ఇండస్ట్రీలో అడుగుపెడుతున్న సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఎన్టీఆర్ గొప్ప విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నానని సీఎం చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మూవీ ప్రారంభోత్సవం అనంతరం హీరో తారక రామారావు మాట్లాడుతూ, మా ముత్తాత ఎన్టీఆర్, మా తాత హరికృష్ణ, మా నాన్న జానకీరామ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయని నమ్ముతున్నాను. ఈ రోజు నా కుటుంబ సభ్యులందరూ నన్ను ప్రోత్సహించడానికి ఇక్కడికి రావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ప్రేక్షకుల ప్రేమాభిమానాలే నన్ను ముందుకు నడిపిస్తాయని నమ్ముతున్నాను. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచి మీడియా ఎంతో సహకరించింది. వారందరికీ కృతజ్ఞతలని అన్నారు.



## నాగార్జునతో ఛాన్స్ మిస్ ..

టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్న నటీమణులలో కాజల్ అగర్వాల్ ఒకరు. ఇప్పటి వరకు ఎన్నో సినిమాలతో, అద్భుతమైన విజయాలు అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. కేవలం తెలుగు సినిమాల్లో మాత్రమే కాకుండా ఇతర భాషలోను దాదాపు అందరు స్టార్ హీరోలతో జతకట్టింది. తన నటన అందంతో ఇండియా వ్యాప్తంగా మంచి క్రేజ్, ఫ్యాన్ ఫాలోయింగ్ దక్కించుకుంది. ఇక పోతే కాజల్ కేవలం హీరోయిన్ పాత్రలు మాత్రమే కాకుండా స్పెషల్ సాంగ్స్ కూడా చేసింది. అయితే తాజాగా ఈ అమ్మడు, నాగార్జునకు సంబంధించిన ఆసక్ఇకర వార్త ఒకటి వైరల్ అవుతుంది..టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోలలో ఒకరైనా నాగార్జున ఇంకా కాజల్ కాంబోలో ఇప్పటివరకు ఒక్క సినిమా కూడా రాలేదు. కానీ వీరిద్దరి కాంబోలో రెండు సినిమాలు మిస్ అయినట్లు– తెలుస్తోంది. నాగార్జున నటించిన 'రగడ' అనే మూవీ చూసే ఉంటారు. ఇందులో అనుష్క, ప్రియమణి హీరోయిన్లుగా నటించారు. అయితే మొదట ఈ మూవీలోని ప్రియమణి పాత్రకు కాజల్‌ను అనుకున్నారట. కానీ కొన్ని కారణాల వల్ల ఆమెను కాకుండా ప్రియమణిని తీసుకున్నారట. ఇక నాగార్జున హీరోగా రూపొందిన 'ది ఘోస్ట్' మూవీ లో కూడా మొదట కాజల్‌ను హీరోయిన్ గా అనుకున్నారట. కానీ అది కుదరకపోవడంతో ఆ సినిమాలో సోనాల్ చౌహాన్ ను హీరోయిన్‌గా తీసుకున్నారు. ఇలా రెండు సార్లు నాగార్జున తో నటించే అవకాశాన్ని కాజల్ మిస్ అయినట్లు– తెలుస్తోంది.





# ఎరుకల ఆత్మగౌరవం కోసమే వచ్చా

- నాంచారమ్మ ఆలయ నిర్మాణానికి సహకరిస్తా
- కేసీఆర్ నేతృత్వంలో పేదలకు సంక్షేమ ఫలాలు
- తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ఎరుకల ఆత్మగౌరవం కోసమే హైదరాబాద్ నుంచి ఇంత దూరం వచ్చానని, నాంచారమ్మ ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని, మరింత రెట్టింపు ఉత్సాహంతో ఉత్సవాలను ప్రతి సంవత్సరం జరుపుకోవాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం మండలంలోని రామాంజాపూర్ గ్రామపంచాయతీ పరిధి పంట పొలాల మధ్య ఉన్న ఎరుకల నాంచారమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ఆధ్వర్యంలో ఎరుకల సంఘం నాయకులు, బీఆర్ఎస్ ప్రతినిధులు కవితకు సాదరంగా స్వాగతం పలికారు. ఎరుకల ఆత్మ గౌరవాన్ని కాపాడడం కోసం, మన సంస్కృతి ఇది అని చెప్పుకోవడం కోసం ఇవాళ ఇక్కడి కార్యక్రమం జరుగుతుందన్నారు. సంస్కృతిని రక్షించుకోవాలని, ఉత్సవాలకు ప్రభుత్వం కూడా చేయూతనందించాలని కోరారు. ములుగు నుంచి మంత్రి సీతక్క ఉన్నందున ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ఇదివరకు చందులాల్, సత్యవతి రాథోడ్ ప్రజా ప్రతినిధులుగా ఉన్న సమయంలో అందరూ సమన్వయంతో పని చేసి ఈ ఉత్సవాలకు చేయూత అందించారన్నారు. ఎరుకల కులస్తులు వెనుకబడి ఉన్నారని, వీరికి ప్రభుత్వం నుంచి అందాల్సినటువంటి అనేక కార్యక్రమాలు ఇదివరకు పెద్దలు కేసీఆర్ నేతృత్వంలో చేపట్టడం జరిగిందన్నారు. ఎరుకల నుంచి పారిశ్రామికవేత్తలు రావాలన్న తలంపుతో కేసిఆర్ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. అటువంటి కార్యక్రమాలు ఏ పార్టీ అధికారంలో ఉన్నాసరే కమ్యూనిటీస్ డెవలప్మెంట్ ఆగకుండా ప్రభుత్వాలు పనిచేయాలని రిక్వెస్ట్ చేస్తున్నానన్నారు. ఉత్సవాలు ప్రతి సంవత్సరం ఇలాగే జరగాలని కోరుకుంటున్నానని అన్నారు. అనంతరం అందరితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, మండల పార్టీ అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవిందు నాయక్, మాజీ జడ్పీటీసీ రుద్రమదేవి–అశోక్, మల్క రమేష్, ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూతాటి రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ, నాయకులు ఆనంద్, కేంసారం నాగులు, సురేష్, రవి, నరేష్, తెలుగు జిల్లా అధ్యక్షుడు కేతిరి భిక్షపతి, నాయకులు పల్లకొండ భాస్కర్, పాలకుర్తి సురేష్, కేతిరి సారయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పెద్దమ్మతల్లి శోభయాత్ర

## పాల్గొన్న గ్రామస్తులు

వరంగల్ నగరం ఖిలావరంగల్ మండల పరిధిలోని తిమ్మాపూర్ లో ముదిరాజ్ కులస్తులు నూతనంగా నిర్మించుకున్న తమ ఇలవేల్పు పెద్దమ్మ తల్లి ఆలయాన్ని సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. రంగసాయిపేట ప్రాంతానికి చెందిన పురోహితులు వేలిదే ప్రదీప్ శాస్త్రి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణ మధ్య ఆలయాన్ని ప్రారంభించారు. ఉదయం ఏడు గంటలకు గణపతి పూజ గోపూజ, పూర్వంగవీధి అనంతరం పెద్దమ్మ తల్లి విగ్రహ శోభాయాత్ర నిర్వహించారు. శోభయాత్రలో డీజే పాటలు, మైకులతో గ్రామమంతా పెద్దమ్మ తల్లి నామస్మరణతో మారు మోగింది. శోభయాత్రలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని మంగళారతులతో స్వాగతం పలికారు. టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో తిమ్మాపురంలో పండుగ వాతావరణం నెలకొంది. మధ్యాహ్నము ఒంటిగంటకు అగ్ని ప్రతిష్టాపన, అంకురార్పణ, ప్రతిష్ట యాగం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన అనంతరం జలాధివాసం నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి ఆడపడుచులు నూతన రాగి బిందెలో నీళ్లను తీసుకొని వచ్చి అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముదిరాజుల కులస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

**– వరంగల్ వాయిస్, కరీమాబాద్**

# వడదెబ్బతో రైతు మృతి



పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామంలో వడదెబ్బతో ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే రైతు మృతి చెందిన విషాద సంఘటన గంట్లకుంట సబ్మిస్ కుంట తండాలో సోమవారం చోటుచేసుకుంది. పండించిన ధాన్యం విక్రయించుకునేందుకు రైతు గుగులోతు కిషన్ (55) కొనుగోలు కేంద్రానికి వచ్చారు. వడ్లు పడుతుండగా కిషన్ ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందారు.

**– వరంగల్ వాయిస్, తొర్రూరు**



# వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ కావ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆత్మకూరు మండలం, నీరుకుళ్ల గ్రామ మాజీ సర్పంచ్ మొగిలి కుమార్తె వివాహనం సోమవారం గూడెప్పాడ్ లోని ఎన్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో పాల్గొన్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, డాక్టర్ నజీర్ దంపతులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తల ఎత్తుకునేలా అభివృద్ధి

- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** రూ.800 కోట్లు కాదు 8పైసలు కూడా తేలేదంటున్న వారు నియోజకవర్గ కేంద్రంలో నిర్మాణం అవుతున్న 100పడకల అస్పత్రి, డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణాలు చూసి అయినా బుద్ధి తెచ్చుకోవాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మాణం అవుతున్న బంజారా భవన్, 100పడకల అస్పత్రి నిర్మాణ పనులకు సోమవారం కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాలకు రూ.77 కోట్లతో పక్కా రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. దాదాపు 20 తండాలకు 38 కిలోమీటర్ల మేర బీటి వేయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 17వేల ఓట్ల జనాభా ఉన్న ఉన్న గిరిజనులకు నియోజకవర్గ కేంద్రంలో బంజారా భవన్ ఉండాలని రూ.2కోట్లతో బంజారా భవన్ నిర్మాణానికి మంజూరు తీసుకువచ్చానని వెల్లడించారు. నియోజకవర్గంలో నూతన గ్రామపంచాయతీలు అయిన 8 గిరిజన తండాలకు రూ.1.60 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే నియోజకవర్గ కేంద్రంలో రూ.63లక్షలతో ఎస్టీ హాస్టల్ భవన నిర్మాణ పనులు చేసుకున్నామని త్వరలోనే ప్రారంభించుకొనున్నట్లు తెలిపారు. బంజారా భవన్ వద్ద లేవలింగ్, డైనింగ్ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. తండాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని వివరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com